# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
VC NEWS
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
బుధవారం 27 మార్చి 2024
సంపుటి.01 సంచిక.230



2 లో

తెలంగాణలో ముదిరిన ఎండలు.. ఆరెంజ్ అలర్ట్

## ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు

# 14 రోజుల రిమాండ్

### కోర్టు ఆదేశాలతో తీహార్ జైలుకు తరలించిన పోలీసులు



**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు రౌస్ అవెన్యూ కోర్టు మంగళవారం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఏప్రిల్ 9 వరకూ ఆమెకు రిమాండ్ విధించగా.. అధికారులు ఆమెను తీహార్ జైలుకు తరలించారు. ఈ కేసులో కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు ఆమెను ఉదయం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. మళ్లీ తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఈడీ కోరగా అందుకు నిరాకరించిన న్యాయస్థానం కవితకు రిమాండ్ విధించింది. ఇప్పటికే రెండుసార్లు కస్టడీకి ఇచ్చామని.. మరోసారి ఇవ్వలేమని పేర్కొంటూ రిమాండ్ విధించింది. మరోవైపు, కవిత బెయిల్ పిటిషన్ పై ఉత్కంఠ కొనసాగుతోంది. తన పిల్లలకు పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కవిత కోర్టును కోరారు. అయితే, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఈడీ అధికారులు కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని.. పలువురు నిందితులను ఇంకా ప్రశ్నిస్తున్నట్లు న్యాయస్థానానికి వివరించారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు.. బెయిల్ పిటిషన్ పై ఏప్రిల్ 1న విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించింది. కవితను మళ్లీ తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ అధికారులు న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. 'కవిత సమాజంలో చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి. ఆమెకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. సాక్ష్యాధారాలను ధ్వంసం చేసే అవకాశం ఉంది. దీని వల్ల దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుంది. లిక్కర్ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. కవిత పాత్రకు సంబంధించి లోతైన దర్యాప్తు చేస్తున్నాం. ఆర్థిక నేరాల దర్యాప్తు చాలా కఠినమైనది. పథకం ప్రకారమే ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. కవితను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలి.' అని ఈడీ కోర్టుకు తెలిపింది. అయితే, ఇప్పటికే రెండుసార్లు కవితను కస్టడీకి ఇచ్చామని.. మరోసారి కుదరదని కోర్టు స్పష్టం చేసింది. కవితకు ఏప్రిల్ 9 వరకు రిమాండ్ విధించింది. మంగళవారం ఉదయం కోర్టుకు హాజరు పరిచిన క్రమంలో కవిత మీడియాతో మాట్లాడారు. 'నాపై తప్పుడు కేసు పెట్టారు. ఇది మనీ లాండరింగ్ కేసు కాదు.. పొలిటికల్ లాండరింగ్ కేసు. ఈ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తా. తాత్కాలికంగా నన్ను జైలులో పెట్టొచ్చు. కానీ నా ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయలేరు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి బీజేపీలో చేరాడు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో వ్యక్తి బీజేపీలో చేరారు. మూడో వ్యక్తి రూ.50 కోట్లు బాండ్ల రూపంలో బీజేపీకి ఇచ్చారు.'



## నల్గొండ జిల్లా ముషంపల్లి నుంచి

# పర్యటన ఖరారు..!

ఎండిన పంట పొలాలను పరిశీలించనున్న కేసీఆర్

**నలగొండ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాలను స్వయంగా తెలుసుకునేందుకు గాను మాజీ ముఖ్యమంత్రి, గులాబీ బాస్ కేసీఆర్ రంగంలోకి దిగుతున్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గడిచిన వారం రోజులుగా ఎండిన పంటపోలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన నివేదికను అధినేతకు అంద జేయడం తో పాటు మీరు కుడా స్వయంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాన్ని పరిశీలించాలని అభ్యర్థించారు. అందుకు అనుగుణంగా స్పందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం రాత్రి తనను కలిసిన కంచర్ల బ్రదర్స్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నల్లగొండ మండలం ముషంపల్లితో పాటు ఆలేరు నియోజకవర్గ పరిధిలో పర్యటించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు.



## వేసవి తాగునీటికి కొరత లేదు

**రిజర్వాయర్లలో తగు మోతాదులో నీరు**

**కలెక్టర్లతో సమీక్షించిన సిఎస్ శాంతికుమారి**

హైదరాబాద్:రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉందని.. ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే 'సమ్మర్ యాక్షన్ ఎ÷-లాన్'ను రూపొందించి జిల్లాలకు నిధులు విడుదల చేయాలని చెప్పారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఏవిధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు చేపట్టడం పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. నిర్వహణ పరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నీటి సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతీ రోజు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలన్నారు. వేసవికాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఆపరేషన్, మెయింటెనెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో ఎదురవుతున్న తాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన వార్తా కథనాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ సారి లోటు వర్షపాతం ఉన్నా, ఇక్కడి ప్రధాన జలాశయాలు,
ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్‌తో గత సంవత్సరం మాదిరిగానే నీటి మట్టాలున్నందున ఆందోళన అవసరం లేదన్నారు. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణపరంగా లోపాలొచ్చాయని.. లోపాలను పరిష్కరించినట్లు చెప్పారు. నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ రెండవ వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమ్జర్గ÷న్సీ పంపింగ్ ను చేపడతామని సి.ఎస్ తెలియచేసారు.

# వందరోజుల పాలనకు రెఫరెండం

**రంగారెడ్డి నుంచే**
**కాంగ్రెస్ ప్రచారం**
**చేవెళ్ల ముఖ్య నేతలతో**
**సిఎం రేవంత్ సమీక్ష**



**హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేంవత్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్యనాయకులు హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు ప్రచార శంఖారావాన్ని పూరించబోతున్నట్టు రేవంత్‌రెడ్డి చెప్పారు. తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో జరిగే జనజాతర సభకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ హాజరవుతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో కనీసం 14 పార్లమెంట్ స్థానాలు గెలవాలన్న పట్టుదలతో ఉన్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతున్నట్టు స్పష్టం చేశారు. అధిష్ఠానం అన్ని రకాలుగా ఆలోచించిన తర్వాతనే చేవెళ్లకు రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరికి సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్‌కు దానం నాగేందర్‌లను అభ్యర్థులుగా ప్రకటించిందని వివరించారు.

## ఎన్నికల తరవాత

# బిజెపిలోకి రేవంత్


2 లో

**అందుకే ప్రధాని మోడీని బడేభాయ్ అన్నారు**

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు**

# నచ్చినోళ్లు జేబులో,

## నచ్చనోళ్లు జైల్లో ఉండాలి


2 లో

**వాళ్లతో ఒప్పందం పెట్టుకోనందుకే కవిత అరెస్ట్**

**కేజ్రీవాల్‌లపైనా అక్రమ కేసులతో అరెస్ట్**

**బిజెపి తీరుపై హరీష్ రావు ఘాటు విమర్శలు**

వేగుచుక్క
బుధవారం 27 మార్చి 2024

## నచ్చినోళ్లు జేబులో, నచ్చనోళ్లు జైల్లో ఉండాలి




**సంగారెడ్డి:** బీజేపీపై బీఆర్ఎస్ పోరాటం చేస్తోందని.. వాళ్లతో ఒప్పందం పెట్టుకో లేదనే కవితను జైలుకు పంపారని ఆరోపించారు. 'ఒప్పందం పెట్టుకుంటే కవిత అరెస్ట్ అయ్యేవారా.?' అని ప్రశ్నించారు. నచ్చినోళ్లు జేబులో, నచ్చనోళ్లు జైల్లో ఉండాలి అన్నట్టుగా బీజేపీ వైఖరి ఉందని మండిపడ్డారు. ఢిల్లీ సీఎం కేజీవ్రాల్ పై అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు విమర్శలు గుప్పించారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీల అమలు చేస్తామన్న హస్తం పార్టీ మాట తప్పిందని మండిపడ్డారు. 'డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకూ చేయలేదు. మాట తప్పడం ఆ పార్టీకి అలవాటే.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతుంది. రైతుబంధు అని.. బోనస్ అని మాట తప్పింది. పింఛన్లు ఇవ్వలేదు. 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే హామీలు అమలు చేయకున్నా ఒప్పుకున్నట్టు అవుతుంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఓడించాలి. చోటే భాయ్ బడే భాయ్ అంటూ రేవంత్ రెడ్డి మోదీ ఆశీర్వాదం తీసుకున్నారు. ముస్లింలను క్యాబినెట్ మంత్రిగా కాంగ్రెస్ ఏనాడూ తీసుకోలేదు. సర్కారు రంజాన్ తోఫా కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. 38 మంది ఆటో కార్మికులు బలవన్మరణానికి పాల్పడ్డారు. బీజేపీ 157 మెడికల్ కాలేజీలు పెడితే తెలంగాణకు ఒక్క కాలేజీ కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేశాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలి.. తెలంగాణ నిలవాలి అనేదే నినాదం కావాలి.' అంటూ హరీష్ రావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని.. కేసీఆర్ ఎప్పుడూ బీజేపీతో కలిసేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ ను చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి హామీల అమలుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకున్నా.. ఆ పార్టీ నేతలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. సంగారెడ్డిలో మంగళవారం నిర్వహించిన మెదక్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఇతర నాయకులు హాజరయ్యారు. మెదక్‌లో గులాబీ జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న అభ్యర్థి రఘునందన్ పనిమంతుడు అయితే దుబ్బాకలో గెలిచేవారని.. ఆయన పని తీరు బాగోలేదనే 54 వేల ఓట్లతో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డిని గెలిపించారని అన్నారు. వెంకట్రామిరెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన, పేద పిల్లల కోసం రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు.

## ఎన్నికల తరవాత బిజెపిలోకి రేవంత్




**హైదరాబాద్:** లోక్ సభ ఎన్నికల తర్వాతా బీజేపీలో చేరే మెదటి వ్యక్తి రేవంత్ రెడ్డినేనని కేటీఆర్ ప్రకటించారు. అందుకే రాహుల్ గాంధీకి భిన్నంగా ప్రధాని మోదీని బడే భాయ్ అంటున్నారన్నారు. జీవితమంతా కాంగ్రెస్ లోనే ఉంటా అని ఏనాడు అనడం లేదని కేటీఆర్ గుర్తు చేశారు. రూ.2500 కోట్లను ఢిల్లీకి రేవంత్ రెడ్డి పంపారన్నారు. జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్న జేబు దొంగ రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. ఈ రోజు కాంగ్రెస్ కు బీజేపీని ఆపే దమ్ము లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి విచిత్రంగా ఉందని.. అక్కడా రాహుల్ గాంధీ చౌకిదార్ చోర్ అంటే, రేవంత్ మాత్రం బడే భాయ్ బాగుండు అంటారన్నారు. అక్కడ అదానీ మంచోడు కాదు అంటే రేవంత్ రెడ్డి మాత్రం మంచోడు అంటాడని.. అక్కడ రాహుల్ గాంధీ, గుజరాత్ మాడల్ దుర్మార్గం అంటే ఇక్కడ మా బడేభాయ్ మాడల్ బాగుందని రేవంత్ అంటుండని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో 40 సీట్లు దాటవన్నారు. బీజేపీలో చేరుతారని విమర్శలు చేసినా .. రేవంత్ అడ్డగోలుగా మాట్లాడారు కానీ.. తన జీవితమంతా కాంగ్రెస్ లో నే ఉంటానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఎందుకంటే ఎన్నికల తర్వాత తన మనుషులతో బిజెపిలో చేరుతారన్నారు. మున్సిపల్ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి మూడు నెలలుగా ఎందుకు బిల్డింగ్ లకు అనుమతులు ఇవ్వడం లేదని ప్రశఅనించారు. డబ్బులు ఇస్తేనే అనుమతులు ఇస్తామని ఢిల్లీకి 2500 కోట్ల రూపాయలు పంపింది నిజం కాదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి లెక్క మాట్లాడటం లేదు జేబులో కత్తెర పెట్టుకొని జేబుదొంగ లెక్క తిరుగుతున్నాడని ఆరోపించారు. కరెంటు , రైతుబంధు ఇవ్వడానికి హామీలు అమలు చేయకుం?.. ఫోన్ ట్యాపింగ్, స్కాముల అంటూ వార్తలు రాయిస్తున్నారని విమర్శించారు. అధికారం నీ చేతల్లో ఉంది ఏం చేస్తావో చెయ్.. తప్పులు చేసిన వాళ్ళపై చర్యలు తీసుకో అని సవాల్ చేశారు. ఆయనకు ముఖ్యమంత్రిగా అసలు పని చేసే తెలివి లేదన్నారు. బీఆర్ఎస్ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు దానం నాగేందర్. ఒకటే మాట చెబుతున్నా. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలు ఉంటాయి. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ఖతమై పోతారు. అధికారం కోసం ఆశపడి, గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లోకి వెళ్లారు దానం. ఖైరతాబాద్ ప్రజలు బ్రహ్మాండమైన నిర్ణయం తీసుకుని తీర్పు ఇస్తారనే విశ్వాసం ఉంది. దానం అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఖైరతాబాద్ ప్రజలు తెలుసుకున్నారు. ఆనాడు ఆసిఫ్‌నగర్‌లో దానం నాగేందర్ టీడీపీ టికెట్ మీద గెలిచి కాంగ్రెస్‌లోకి వచ్చారు. మళ్లీ ఉప ఎన్నికలో ఓడిపోయారు. ఇప్పుడు కూడా అదే పునరావృతం కాబోతోందన్నారు. రెండు పడవల ప్రయాణం మంచిది కాదు.. అక్కడ ఓ కాలు, ఇక్కడ ఓ కాలు వేస్తే ఎటు కాకుండా అయితది. దానంను అనర్హుడిగా ప్రకటించాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేశాం. దానం నాగేందర్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయ ఒత్తిళ్లకు స్పీకర్ లోనైతే, వదిలిపెట్టకుండా సుప్రీంకోర్టుకు వెళ్తాం.. దానంను అనర్హుడిగా చేసేదాకా పోరాడుతం. ఖైరతాబాద్‌లో మూడు, నాలుగు నెలల్లో ఉప ఎన్నిక వస్తుంది. దానికి తయారుకావాలి. ద్రోహం చేసిన నాయకులకు బుద్ధి చెప్పాలని మనవి చేస్తున్నా. సికింద్రాబాద్‌లో పోటీ మనకు కాంగ్రెస్‌తో లేదు. అది మూడో స్థానంలో ఉంది. దానంను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. మనకు పోటీ బీజేపీతోనే అని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణలో ముదిరిన ఎండలు.. ఆరెంజ్ అలర్ట్



హైదరాబాద్,: తెలంగాణ వ్యాప్తంగా ఎండలు ముదురుతున్నాయి. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు నిప్పులు చిమ్ముతున్నాయి. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు
సాధారణ స్థాయి కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా రికార్డవుతున్నాయి. రాగల ఐదు రోజుల్లో ఇవి మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం నెలకునే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 37, కనిష్టంగా 24డిగ్రీలు నమోదయ్యే అవకాశాలున్నాయి. తరువాత 48గంటల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38డిగ్రీలకు పెరిగే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో కూడా సగటు ఉష్ణోగ్రతలు గరిష్టంగా 38నుంచి 41డిగ్రీలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. రాష్ట్రంలో మంగళవారం ఉష్ణోగ్రతల తీవ్రత మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, కొమరంభీం, అదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, రంగారెడ్డి, పెద్దపల్లి,ములుగు, కరీంనగర్, వరంగల్ జిల్లాలు ఆరెంజ్ అలర్ట్ జాబితాలో ఉన్నాయి. ఈ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు పైనే నమోదయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరిచింది.

## కేజీవ్రాల్‌కు కస్టడీలో కాగితం ఎలా దొరికింది?

న్యూ ఢిల్లీః ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ ఆదివారం తన సహచర మంత్రికి ఆదేశాలు జారీ చేయడాన్ని ఈడీ తీవ్రంగా పరిగణించింది. కస్టడీ సమయంలో ప్రధాన కార్యాలయంలో ఉన్న కేజీవ్రాల్‌కు కంప్యూటర్ లేదా కాగితాలను తాము సమకూర్చలేదని దర్యాప్తు సంస్థ చెబుతోంది. ఆదేశాలు బయటకు ఎలా వెళ్లాయో తెలుసుకొనేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఆదేశాలు పేర్కొన్న కాగితం ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకొనేందుకు ఆప్ మంత్రి ఆతిశీని ఈడీ ప్రశ్నించే అవకాశం ఉంది. దీంతో పాటు జైల్లో కేజీవ్రాల్ కదిలికలను గమనించేందుకు సీసీ టీవీ దృశ్యాలను కూడా పరిశీలించవచ్చని చెబుతున్నారు.

# టెట్ ఫీజు గతంలో కన్నా 150 శాతం పెంచారు

### దరఖాస్తు దారులు ఒక్క రూపాయి కూడా చెల్లించొద్దన్నారు

### బీఆర్ఎస్ నేత వాసుదేవ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్:** టెట్ కు సంబంధించి అభ్యర్థులు మాకు అనేక విన్నపాలు చేస్తున్నారు%ౌ%టెట్ తో పాటు ఏ ఉద్యోగ పరీక్ష కు ఫీజులు వసూలు చేయమని కాంగ్రెస్ మేనిఫెస్టో లో పెట్టారు.ఆ హామీని ఉల్లంఘించి టెట్ ఫీజు గతం లో కన్నా 150 శాతం పెంచారని బీఆర్ఎస్ నేత వాసుదేవ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.హైదరాబాద్ తెలంగాణ భవన్ లో ప్రెస్ మీట్ లో మాట్లాడిన ఆయన..దరఖాస్తు దారులు ఒక్క రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేదని అభయ హస్తం మేనిఫెస్టో లో పెట్టారు. రేపటి నుంచి టెట్ దరఖాస్తులు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టో లో పెట్టిన హామీకి అనుగుణంగా నడుచుకోవాలి. లేకుంటే టెట్ అభ్యర్థులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మా నేత హరీశ్ రావు పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు వాసుదేవ రెడ్డి. రైతుల బాధలను హరీశ్ రావు ప్రస్తావిస్తే తప్పేంటి..పంట నష్టపోయినపుడు కేసీఆర్ హయం లో 10 వేల రూపాయలు నష్టపరిహారం ఇచ్చింది నిజం కాదా..రైతుల గురించి పట్టించుకోమని హరీశ్ రావు అడిగితే జూపల్లి కి ఎందుకు అంత అక్కసు ? అని ప్రశ్నించారు. రేవంత్ రైతులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క దాన్ని అమలు చేయలేదు. రేవంత్ హామీల వైఫల్యం పై చర్చకు వస్తావా జూపల్లి ? అని సవాల్ విసిరారు వాసుదేవ రెడ్డి. జూపల్లి బీఆర్ ఎస్ మొదటి టర్మ్ లో మంత్రిగా ఉన్నానన్న విషయం మరచిపోతున్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ మంత్రులు దోచుకున్నారు అంటున్నారు..మరి ఐదేండ్లు మంత్రిగా ఉన్న జూపల్లి ఎంత దోచుకున్నారో చెప్పాలన్నారు.ఒక వేలు మా వైపు చూపితే జూపల్లి వైపు నాలుగు వేళ్ళు చూపుతామన్నారు. రాజకీయ వ్యాఖ్యలు మాని రైతుల శ్రేయస్సు గురించి ఆలోచించాలన్నారు.కాంగ్రెస్ నేతలకు రైతుల మీద ప్రేమ ఉంటె మేనిఫెస్టో లో పెట్టిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రైతు రుణ మాఫీ అమలు చేయాలన్నారు. యాసంగి పంటకు మద్దతు ధర తో పాటు బోనస్ చెల్లించాలి. రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు వాసుదేవ రెడ్డి.

# ఎనిమిది సీట్ల ఆశావహుల్లో టెన్షన్..టెన్షన్

**హైదరాబాద్ః** రాష్ట్రంలో మిగిలిన ఎనిమిది లోక్‌సభ స్థానాల ఎంపికపై సిఎం రేవంత్‌రెడ్డి వరుస సమీక్షలు చేస్తున్నారు. ఆశావహులను బుజ్జగించేందుకు ఆయన తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. నాయకుల్లో ఏకాభిప్రాయాన్ని తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ కూడా ప్రయత్నిస్తున్నారు. అయితే ఈనెల 27వ తేదీ లేదా 28వ తేదీన మూడో జాబితాలో మిగిలిన 8 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో అసమ్మతి తలెత్తకుండా ఏఐసిసి నాయకులు పక్కా వ్యూహంతో ముందుకెళుతున్నారు. ఈ నేపథ్యంలో ఏఐసిసి నాయకులు రంగంలోకి దిగినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆశావహులను బుజ్జగించే పనిలో ఉన్నట్టుగా సమాచారం. అంతా సద్దుమణిగాక 8 నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అయితే ఈనెల 27వ తేదీన జరిగే సీఈసి ( కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ) సమావేశంలో అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 17 ఎంపి నియోజకవర్గాలకు గాను ఇప్పటికే రెండు విడతల్లో 9 మంది అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మరో ఎనిమిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అయితే ఈ ఎనిమిది నియోజకవర్గాల్లో ఆశావహులు అధికంగా ఉండడం, వాటికి సంబంధించిన సర్వేల నివేదికలను సునీల్ కనుగోలు బృందం ఏఐసిసికి అందించినట్లుగా తెలిసింది.

ఇప్పటివరకు 9 సీట్లకు అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించగా అందులో సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, మల్కాజిగిరి నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, చెవేళ్ల నుంచి రంజిత్ రెడ్డి, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి, పెద్దపల్లి గడ్డం వంశీకృష్ణ, నల్లగొండ రఘువీర్ రెడ్డి, మహబూబ్ నగర్ వంశీచందర్ రెడ్డి, జహీరాబాద్ సురేష్ షెట్కార్, మహబూబాబాద్ బలరాం నాయక్‌లను అభ్యర్థులను



ప్రకటించగా ఇందులో మూడు సీట్లు కొత్తగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్
పార్టీ కేటాయించింది. ఇక ప్రకటించని స్థానాల్లో భువనగిరి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం నియోజకవర్గాలు ఉండగా ఆయా నియోజకవర్గాల్లో సీట్ల కోసం ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని నియోజకవర్గాల అభ్యర్థులపై ఏకాభిప్రాయం వచ్చినా స్థానిక నాయకత్వం నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఆదిలాబాద్ టికెట్ ను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించిన వారికే ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ నియోజకవర్గానికి సుప్రీంకోర్టు న్యాయవాది షహనాజ్‌ను ప్రకటిస్తారని భావించినా ప్రస్తుతం ఆ పేరు ఆగిపోయినట్టుగా తెలుస్తోంది. హైదరాబాద్, ఆదిలాబాద్ అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం ఒక నిర్ణయానికి రాలేకపోతున్నట్టుగా సమాచారం. భువనగిరి నుంచి చామల కిరణ్‌రెడ్డి అభ్యర్థిత్వంపై కోమటిరెడ్డి సోదరులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని సమాచారం. వరంగల్ టికెట్ కోసం దమ్మాటి సాంబయ్యతో పాటు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పసునూరి దయాకర్ పోటీ పడుతున్నారు. కరీంనగర్ నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ ఆయనకంటే బలమైన అభ్యర్థి కోసం రాష్ట్ర
నాయకత్వం అన్వేషిస్తున్నట్లు సమాచారం. నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి టికెట్
ఆశిస్తున్నప్పటికీ స్థానికంగా అభ్యంతరాలు వస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని సునీల్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ ప్రొడ్యూసర్ దిల్ రాజు పేరు లేదా ఆయన అన్న నర్సింహారెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లుగా సమాచారం.
మెదక్ నుంచి నీలం మధు అభ్యర్థిత్వం దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కానీ, ఆయన అభ్యర్థిత్వంపై స్థానికంగా వ్యతిరేకత వస్తున్నట్టుగా తెలిసింది. అయితే మెదక్ సీటును మైనంపల్లి హన్మంతరావు, సినీ నటి విజయశాంతిలు కూడా పోటీ పడుతున్నట్టుగా తెలిసింది. ఖమ్మం అభ్యర్థి ఎంపికపై రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ స్థానిక నాయకుల అభిప్రాయాలను సైతం సేకరించింది. చివరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డికి టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

## అడుగంటిన జలాశయాలు

హైదరాబాద్: మార్చి మాసం లోనే తెలంగాణలో ఉష్ణోగ్రతలు మండు వేసవిని తలపిస్తున్నాయి. సెగల ధాటికి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తరిగిపోతు న్నాయి. ఉన్న కొద్దిపాటి నీటిపై వేసవి అవసరాల దృష్టా పొదుపు చర్యలు తీసుకుంటుంటే ..మరోవైపు సెగలు చిమ్ముతున్న ఉష్ణోగ్రతల ధాటికి రిజర్వాయర్లలో నీటి అవిరి శాతం పెరుగుతూ వస్తోంది. తెలుగు రాష్ట్రాలకు జీవనాడులుగా ఉన్న కృష్ణా, గోదావరి ,పెన్నా నదుల పరివాహకంగా ఉన్న 14 ప్రధాన జలాశయాల్లో నీటి నిలువలు రోజురోజుకు తరిగిపోతున్నాయి. ఈ జలాశయాల్లో గరిష్ట స్థాయి నీటినిలువల్లో 70శాతం పైగా ఖాళీ అయ్యాయి. వీటిలో పూర్తి స్థాయి నీటినిలువ సామర్థం 963 టీఎంసీలు కాగా, ప్రస్తుతం వీటిలో నీటినిలువ 295టిఎంసీలకు పడిపోయింది.
గత ఏడాది వేసవిలో ఈ సమయానికి ఈ జలాశయాల్లో 511టిఎంసీల నీరు నిలువ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే వీటిలో నీటినిలువలు 216టిఎంసీలు తక్కువగా ఉన్నాయి. కృష్ణానది పరివాహకంగా ప్రధాన ప్రాజెక్టుల పరిస్థితి ఊస్సూరుమనిపిస్తోంది. రాష్ట్ర ముఖద్వారాంలో ఉన్న జూరాల జలాశయం రోజురోజుకు అడుగంటుతోంది. ఈ జలాశయంలో గరిష్టస్థాయి 9.66టిఎంసీలకు గాను ప్రస్తుతం 3.48టిఎంసీల నీరు నిలువ ఉంది. శ్రీశైలం జలాశయం
మరింతగా అడుగంటిపోయింది. 215టీఎంసీల పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థం ఉన్న ఈ జలాశయంలో నీటినిలువ 34టిఎంసీలకు తరిగిపోయింది. నీటిమట్టం కూడా 810అడుగుల డెడ్ స్టోరేజికి చేరుకుంది. గత ఏడాది ఈ జలాశయంలో నీటినిలువ ఈ సమయానికి 821అడుగుల వద్ద 41టిఎంసీల నీరు నిలువ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే ఏడు టీఎంసీలు తక్కువగాఉంది. జలాశయంలో 179టీఎంసీల ఖాళీ ఏర్పడింది. దిగువన నాగార్జునసాగర్‌లో నీటిమట్టం మరింత వేగంగా తరిగి పోతోంది. సాగర్ జలాశయం విస్తరణ పరిధి అధికంగా ఉండటంతో ఎండల తీవ్రతకు నీటి అవిరి శాతం పెరుగూతూ వస్తోంది. జలాశయంలో 312టీఎంసీల గరిష్ట నీటినిలువ సామర్థానికిగాను ప్రస్తుతం ఇందులో 139టిఎంసీల నీరు నిలువ ఉంది.నీటిమట్టం 513అడుగులకు చేరింది. మరో మూడు అడుగులు ఖాళీ అయితే ఇక సాగర్ జలాశయంలో నీటినిల్వ డెడ్‌స్టోరేజికి పడిపోనుంది. గత ఏడాది ఇందులో ఈ సమయానికి 191టిఎంసీల నీరు నిలువ ఉండేది. ఈ సారి 52టిఎంసీల నీరు తక్కువగా ఉంది. జలాశయం 172టీఎంసీల మేరకు ఖాళీ ఏర్పడింది. దిగువన ఉన్న పులిచింతల జలాశయాన్నికూడా ఎడా పెడా తోడేశారు. ఇందులో నీటినిల్వ 4.70టిఎంసీలకు పడిపోయింది. గరిష్ఠస్థాయి 45టిఎంసీల నిల్వ సామర్దం ఉన్న ఈ జలాశయంలో గత ఏడాది ఈ
సమయానికి 42టిఎంసీల నీరు నిలువ ఉండేది. ప్రకాశం బ్యారేజి కింద ఏపిలో అవసరాల పేరుతో పులిచింతల నుంచి 40టిఎంసీల నీటిని తోడేశారు. కృష్ణాకు ప్రధాన ఉపనదిగా ఉన్న తుంగభద్ర నదీ ఇసుక తిన్నెలు తేలి ఎడారిని తలపిస్తోంది. తుంగభద్ర ప్రాజెక్టులో పూర్తి స్థాయి 105టిఎంసీల నిలువ
సమార్థానికిగాను ప్రస్తుతం ఇందులో 5టిఎంసీలు మాత్రమే ఉన్నాయి. గత ఏడాది ఈ సమయానికి ఇందులో 23టిఎంసీలు నిలువ వుండేవి. ఈ ఏడాది మొత్తంగా తుంగభద్ర నదిద్వారా తెలుగు రాష్ట్రాలకు 20టిఎంసీలకు మించి దక్కలేదు.
ఇక, గోదావరి నదిపరివాహకంగా జలాశయాలపై ఈ వేసవిలో మేడిగడ్డ ఎఫెక్ట్ గట్టిగానే పడింది. మేడిగడ్డ నుంచి ప్రాణహిత నదీజలాల ఎత్తిపోత ఆగిపోయవటంతో ఎగువన ఉన్న శ్రీరాంసాగర్ జలాశయంపైన నీటి వత్తిడి పెరిగిపోయింది. దీంతో శ్రీరాం సాగర్ జలాశయం ఇప్పటికే 80శాతం ఖాళీ అయిపోయింది.

# మండుటెండలు.. రాజకీయ ప్రచారాలు

**హైదరాబాద్,:** మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. ఎండాకాలం ఎన్నికలతో పార్టీల నేతలు మొదలు కార్యకర్తలు నానా హైరాన పడుతున్నారు. ఎన్నికల పోరులోకాంగ్రెస్ పార్టీ కూడా ఇందుకు సమాయత్తం అవుతోంది. ఎపిలో టిడిపి ఉమ్మడిగా పోరాటం చేపట్టింది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరుగుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటిపట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందోళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలతో పాటు ఇతర చిల్లర పార్టీలకు కూడా ఈ యాతన తప్పడం లేదు. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీనికితోడు ఎన్నికల్లో పోటీకి రాజకీయ పార్టీలన్నీ ఇప్పటి నుంచే వ్యూహాలు రూపొందిస్తు న్నాయి. అన్ని పార్టీలు మళ్లీ పోటీకి సమాయత్త మవుతున్నాయి. గెలుపు గుర్రాలను బరిలో దించి పాగా వేసేందుకు వ్యూహారచన చేస్తున్నాయి. ఇప్పటి నుంచే పట్టుపెంచుకునేందుకు కాంగ్రెస్, కొన్నిచోట్లనైనా ఖాతా తెరిచేలా భాజపా ఇలా ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. మరోవైపు ఎండలతో కార్యకర్తలు వాపోతున్నారు. వేసవిని తలచుకుంటేనే భయం వేస్తోందని అంటున్నారు. మొత్తంగా రాజకీయాపార్టీలు తమాందోళనా కార్యక్రమాలతో ఎండలకు మించి పరీక్ష పెడుతున్నాయి. మొత్తమ్మీద మళ్లీ పార్టీల హడావిడితో రాష్ట్రాల్లో అప్పుడే ఎన్నికల వేడి మొదలు కానుంది. మొత్తంగా జిల్లాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకేసారి అన్ని పార్టీలు రోడ్లపైకి వస్తుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అధికార పార్టీకి ధీటుగానే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర నేతలు, మంత్రులు కావాలనే కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నేతలు ఈ ధర్నాలో ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ పోరాటాలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ ధర్నాలు చేస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీల కార్యకర్తలు ఇక ఎండలను లెక్క చేయకుండా రోడడ్డెక్కాల్సిన ఆగత్యం ఏర్పడింది. రాజకీయంగా సత్తా చాటాలనుకుంటున్న లీడర్లు ఈ బాధ్యతను భుజాన వేసుకోక తప్పదు.

## ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నాలు

## అభివృద్ధి మంత్రంగా పథకాలకు పెద్దపీట

హైదరాబాద్,: మనిషి ఎదుగడానికి అభివృద్ధి మార్గాలు తెరిచి పెట్టడమే పేదరిక నిర్మూలన పథకాల లక్ష్యం కావాలని ఐక్యరాజ్య సమితి ఘోషిస్తున్నది. ఈ భావనతోనే అభివృద్ధి వ్యూహాలకు రూపకల్పన చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులకు ప్రచారార్భాటమే తప్ప పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ప్రకటించలేదు. అందుకే ప్రజలకు దానిపై ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. బడ్జెట్ అంటే సంవత్సరానికొక్కమారు ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రవేశపెట్టే తద్దినంగా ప్రజలు
భావించే స్థితి వచ్చిందంటే దానికి కారణం పాలకులు వాటిని వాస్తవ పరిస్థితులకు దూరంచేసి అంకెల గారడీగా మార్చడమే. పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు జవజీవాలు సమకూర్చడం, కులవృత్తులకు ఆలంబన, గ్రామీణ సమాజాన్ని అభివృద్ధి కాముకమైనదిగా చూడటం మొదలైనవన్నీ ఆర్థిక ప్రగతికి దోహద పడతాయి. ఎవరు ఉన్నా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కులవృత్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చిన్ననీటి పారుదల రంగం వట్టి పోయింది. ప్రాజెక్టులు, మేఘమధనం పేరుతో ఉమ్మడి ఎపిని దోచుకుతిన్నారు. గతంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించడం ఖర్చుల్లో కోతలు పెట్టడం ప్రభుత్వాల ఘన కార్యాలుగా చెప్పుకున్నారు. బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం, భారాలు తరువాత వేయడం కూడా మరో ఎత్తుగడ వేయడం కాంగ్రెస్ హయాంలో జరిగిందని చెప్పడానికి అనుమానాలు అక్కర్లేదు. ఖర్చులకూ సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవహారాలు నడిచాయి.

# పొరుగు రాష్ట్రాల ధాన్యం రాకుండా గట్టి నిఘా.






## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

## అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 26**

యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో, పొరుగు రాష్ట్రాల నుండి ధాన్యం నిల్వలు రాకుండా గట్టి నిఘా ఉంచుతామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి మంగళవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపడుతున్న చర్యల గురించి సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి 06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. గతేడాది జిల్లాలో 460 కేంద్రాలు కొనసాగగా, ప్రస్తుతం 466 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల రైతులందరికీ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండేలా ఆయా ప్రదేశాలను గుర్తించడం జరిగిందన్నారు. ఎలాంటి ఒడిదుడుకులకు తావులేకుండా కేంద్రాలు సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతోనూ సమావేశమై స్పష్టమైన సూచనలు చేశామని, రైతుల నుండి సేకరించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుండి ఎలాంటి జాప్యం లేకుండా వెంటదివెంట రైస్ మిల్లులకు చేరవేసేలా చొరవ చూపాల్సిందిగా సూచించామని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. ధాన్యం నిల్వ చేసేందుకు కోటీ 30 లక్షల గన్నీ బస్తాలు అవసరం ఉండగా, జిల్లాలో కోటీ 11 లక్షల గన్నీ బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం నిల్వలు రాకుండా గట్టి నిఘా కొనసాగిస్తామని అన్నారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా జిల్లాలో నాలుగు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఈ చెక్ పోస్ట్ ల ద్వారా కూడా పొరుగు రాష్ట్రాల నుండి ధాన్యం జిల్లాలో ప్రవేశించకుండా కట్టడి చేస్తామని అన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు, ఫ్లెక్సీలు, పోస్టర్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తు.చ తప్పకుండా నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టామని సీ.ఎస్ కు తెలిపారు.

కాగా, వీ.సీ ముగిసిన అనంతరం కలెక్టర్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. ఏప్రిల్ మొదటి వారంలోపు జిల్లాలోని అన్ని నిర్దేశిత ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏప్రిల్ 10 లోపు అన్ని సెంటర్స్ రైతులకు అందుబాటులోకి రావాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, నిర్లక్ష్యానికి తావివ్వకుండా రైతాంగ ప్రయోజనాలే కర్తవ్యంగా కొనుగోలు కేంద్రాలను నెలకొల్పాలని హితవు పలికారు. కేంద్రాల్లో తాగు నీరు, నీడ కోసం షామియానాలు వంటి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో పాటు, టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు వంటి వాటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులు నాణ్యత ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం నిల్వలను కేంద్రాలకు తెచ్చి, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర పొందేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్ఓ చంద్రప్రకాశ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి గంగూబాయి, సహకార శాఖ అధికారి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# పౌరహక్కుల సంఘం

## నేత మొవ్వా నాగేశ్వర రావు మరణం.

## పలువురు వామ పక్ష నేతల సంతాపం.

## మృత దేహం నేడు మెడికల్ కళాశాలకు అప్పగింతకు ఎర్పాటు.

**వేగుచుక్క న్యూస్ , నిజామాబాద్ , మార్చి 26**

పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జంపాల చంద్ర శేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ. ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ సభ్యులు మొవ్వా నాగేశ్వర రావు (88) మంగళవారం మరణించారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగేశ్వర్ రావు మాక్లూర్ మండలం, కొత్తపల్లి గ్రామంలో మరణించారు.

మొవ్వా నాగేశ్వర రావు 1936 ఏప్రిల్ 14 న గుంటూరు జిల్లా పెదనందిపాడు లో జన్మించారు. చదువుకొనే టప్పుడే కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులు అయ్యారు. కమ్యూనిస్టు నేత, కొల్లా వెంకయ్యది కూడా పెదనందిపాడు గ్రామమే. కొల్లా వెంకయ్య ఇంకా ఇతర కమ్యూనిస్టు నేతల సాన్నిధ్యం లో చురుకైన కార్యకర్తగా ఎదిగారు. నిజామాబాద్ జిల్లాలో ఉపాధ్యాయులు గా ఉద్యోగం రావడంతో తెలంగాణాకు వచ్చారు. తన చిన్ననాటి స్నేహితురాలు, సహోపాధ్యాయి తులసిని వివాహం చేసుకున్నారు. వీరికి శరత్, సురేష్ పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నప్పుడే ఉపాధ్యాయ ఉద్యమమం లో జిల్లా నేతగా పని చేశారు. ప్రస్తుత సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర నాయకులు
వేములపల్లి వెంకట్రామయ్య తో కలిసి ఉపాధ్యాయులను సంఘంలోకి సమీకరించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో గట్టి కార్యకర్తగా పనిచేశారు. పిడిఎస్ యు నిర్మాతల్లో ఒకరైన జంపాల చంద్రశేఖర ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ లో మొవ్వా నాగేశ్వర రావు ఒక ట్రస్టీ.నాగేశ్వర రావు పార్థీవ దేహాన్ని, వారి కోరిక ప్రకారం, కుటుంబ సభ్యులైన శరత్, సురేష్ లు బుధవారం నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి, వైద్య విద్యార్థుల అధ్యయనం కోసం అందచేస్తారు. కాగా నాగేశ్వర్ రావు మృతి పట్ల పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆల్గొట్ రవీందర్, ప్రముఖ న్యాయావాది, మానవ హక్కుల సంఘం నేత గొర్రెపాటి మాధవరావు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి మరణం వామ పక్ష ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.





## నలంద" విద్యార్థులకు కె సాట్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు.

**- విద్యార్థులను అభినందించిన యాజమాన్యం ప్రసాద్, సాగర్.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, మార్చి 26**

పట్టణంలోని మామిడిపల్లి లో గల నలంద హై స్కూల్, ఈ అభ్యాస్ అకాడమీ, హైదరాబాద్ సమిష్టిగా విద్యార్థుల ప్రతిభను పెంచడానికి నిర్వహిస్తున్నటువంటి ఐఐటి, ఒలంపియాడ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ లో నలంద విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఫిబ్రవరి 25వ నిర్వహించినటువంటి కలాం ఆప్టిట్యూడ్ టెస్ట్ లెవెల్ -1, లెవెల్ -2 రాష్ట్రవ్యాప్తంగా 600 పైగా పాఠశాల విద్యార్థులు ఈ ఎగ్జామ్స్ రాయడం జరిగింది. ఈ కాంపిటీటివ్ పరీక్షలుల్లో నలంద విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఏడవ తరగతిలో సిహెచ్. హనీ రెడ్డి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, నాలుగవ తరగతిలో పెరుగు యువరాజ్ స్టేట్ థర్డ్ ర్యాంక్ లు కైవసం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. మిగిలిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాప్ 100 లోపు ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ లు మంగళవారం సన్మానించారు. స్టేట్ ర్యాంక్ సాధించిన ఇద్దరు విద్యార్థులకు వచ్చే ఆదివారము హైదరాబాద్ లోని 'భారతీయ విద్య భవన్ ఆడిటోరియంలో' సన్మానం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించడం కొరకు కృషిచేసిన విద్యార్థులకు ఐఐటి, ఒలంపియాడ్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

## డిసిసిబి బ్యాంక్ చైర్మన్‌గా కుంట రమేష్ రెడ్డి.

**- ఏకగ్రీవంగా ఎన్నిక. హస్తం చేతికి ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 26:**

ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా కుంట రమేష్ రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. డిసీసీబి బ్యాంకులో చైర్మన్ ఎన్నికపై పాలక వర్గ సమావేశం నిర్వహించారు. చైర్మన్ ఎన్నిక కోసం ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో చైర్మన్ గా కుంట రమేష్ రెడ్డిని ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం పదవి బాధ్యతలు చేపట్టిన రమేష్ రెడ్డి కి పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంట రమేష్ రెడ్డి మాట్లా డుతూ.. తనను ఏకగ్రీవం ఎన్నుకున్నందుకు డైరెక్టర్లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు సహ కరించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు
ఏనుగు రవీందర్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్ లకు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞత లు తెలిపారు.జిల్లా రైతన్నలకు తన సహకారం ఉంటుందని, రైతులకు, డైరెక్టర్లకు ఉద్యో గులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. తనపై నమ్మకంతో ఏకగ్రీవం చేసినందుకు ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా బ్యాంకు అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు కుంట రమేష్ రెడ్డి అభిమానులు టపాకా యలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు రావద్దు.

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**


**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మార్చి 26**

వేసవి త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లా అధికారులతో మంగళవారం కలెక్టర్ తాగునీటి ఎద్దడి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవేసవి కాలంలో త్రాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని , ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డు స్థాయిలో త్రాగునీటి సరఫరాకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని తెలిపారు. త్రాగునీటి పైప్ లైన్ లీకేజీలు అరికట్టాలని కోరారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్, ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ ల పరిధి లో తాగు నీటి సరఫరాను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.జిల్లాలో తాగునీటి అవసరాల మేరకు బోరు బావులను, పాత త్రాగునీటి సరఫరా మోటార్లను పునరుద్ధరించాలని, త్రాగునీటి సరఫరా నిమిత్తం అవసరమైన పనులను వెంటనే




చేపట్టాలని , ఎక్కడ నిధులకు ఆటంకం లేనందున అత్యంత ప్రాధాన్యతతో త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పరిధిలో ఉన్న త్రాగునీటివ్యవస్థను ఒకసారి పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు పూర్తిచేయాలని తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో చివరి వార్డ్, గ్రామాలలో చివరి ప్రాంతం వరకు త్రాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, సరఫరా లో అంతరాయం ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నయ ఏర్పాట్లు సత్వరమే చేయాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవోలు, తాగునీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.

# అనౌన్స్‌మెంట్ ఇదిగో..





రామ్ చరణ్-సుకుమార్ కాంబోలో రాబోతున్న కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఎవరూ ఊహించని విధంగా హోలీ రోజున ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్ ఇచ్చారు. మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు నాడు ఓ భారీ సర్‌ప్రైజ్ ఉంటుందని ఫ్యాన్స్ అంతా ఊహించారు. కానీ వాళ్ల అంచనాలను తలకిందులు చేస్తూ హోలీ రోజునే సర్‌ప్రైజ్ ఇచ్చారు రామ్ చరణ్. మైత్రీ మూవీ మేకర్స్ ఈరోజు ఓ కీలక ప్రకటన చేసింది. రామ్ చరణ్- సుకుమార్ కాంబోలో RC 17 (వర్కింగ్ టైటిల్) రాబోతుందంటూ ప్రకటించారు. వీళ్ల కాంబోలో వచ్చిన రంగస్థలం భారీ బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రామ్ చరణ్-సుకుమార్ హోలీ సెలబ్రెట్ చేస్తున్న ఫొటోను షేర్ చేసింది మైత్రి మూవీ మేకర్స్. దీంతో పాటు రెండు గుర్రాలు ఉన్న ఓ ఫొటోను షేర్ చేస్తూ Raring2Conquer అనే హ్యాష్‌ట్యాగ్‌ను పెట్టారు. ఇక ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మించబోతుంది. అలానే ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం ఇవ్వబోతున్నారు. ఇలా రంగస్థలం టీమ్ మొత్తం మరోసారి కలిసిందంటూ ఫ్యాన్స్ ఉత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం RC 17 హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంది. ఈ పాన్-ఇండియన్ సినిమా గురించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. గేమ్ ఛేంజర్-పుష్ప 2ఇక ప్రస్తుతం రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ షూటింగ్‌ను వీలైనంత త్వరగా ముగించుకొని ఆర్‌సీ 16 షెడ్యూల్ మొదలుపెట్టాలని చెర్రీ అనుకుంటున్నారు. బుచ్చి బాబుతో చేస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. పూజా కార్యక్రమాలతో ఇటీవల గ్రాండ్‌గా ఈ సినిమాను లాంఛ్ చేశారు. ఇక తన పుట్టిన రోజు అయిన మార్చి 27న గేమ్ ఛేంజర్ నుంచి జరగండి సాంగ్‌ను రిలీజ్ చేయబోతున్నారు. మరోవైపు సుకుమార్ పుష్ప 2 సినిమాతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఈ చిత్రం లాస్ట్ షెడ్యూల్ వైజాగ్, హైదరాబాద్‌లో ముగిసింది. ఇక పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెట్టబోతున్నారు. వీలైనంత త్వరగా వీటిని ముగించుకొని ఆగస్టు 15న సినిమా రిలీజ్ చేయాల్సి ఉంది. పుష్ప సినిమాతో పాన్ ఇండియా లెవల్లో బ్లాక్ బస్టర్ అందుకున్నారు సుకుమార్. బన్నీకి భారీ హిట్ ఇచ్చి ఇప్పుడు పుష్ప 2 చిత్రాన్ని తీశారు. దీంతో సుకుమార్ క్రేజ్ మరింత పెరిగిపోయింది. పుష్ప 2 రిలీజ్ అయిన తర్వాత RC 17 షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉంది. ఎలాగైనా 2025 చివరి నాటికి RC 17ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట.

మరి అనుకున్నట్లు అవుతుందో లేదో చూడాలి.

# నా సినిమా రీమేక్ చేశారని నాకే తెలీదు..



మలయాళంలో స్టార్ హీరో అయిన పృథ్వీరాజ్ సుకుమారన్ తెలుగు ఆడియన్స్‌కి 'సలార్' సినిమాతో బాగా దగ్గరయ్యారు. ఈ చిత్రంలో ప్రభాస్ స్నేహితుడైన వరదరాజ మన్నార్ పాత్రలో అద్భుతంగా నటించారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'ఆడుజీవితం' (ది గోట్ లైఫ్) ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు పృథ్వీరాజ్. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో కూడా పలు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రీమేక్ సినిమాలపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

నాకే తెలీదు... పృథ్వీరాజ్ సినిమాలైన అయ్యప్పన్ కోషియమ్, లూసిఫర్, ముంబై పోలీస్‌లను తెలుగులో కూడా రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు చిత్రాలను భీమ్లా నాయక్, గాడ్ ఫాదర్, హంట్ పేర్లతో తెలుగులో రీమేక్ చేశారు. ఈ చిత్రాలను మీరు చూశారా అని అడిగిన ప్రశ్నకి లేదు అంటూ పృథ్వీరాజ్ బదులిచ్చారు. "నేను నటించిన ముంబై పోలీస్ తెలుగులో రీమేక్ చేశారని నాకు అసలు తెలీదు. ఇక భీమ్లా నాయక్ సినిమా నేను చూడలేదు.. అయితే కొన్ని సీన్లు మాత్రం చూశాను. అలానే గాడ్ ఫాదర్‌లో కొన్న సీక్వెన్స్‌లు కూడా చూశాను. అయితే ఈ రెండు చిత్రాలు చూసే టైమ్ నాకు దొరకలేదు.. ఆ సమయంలో వేరే ఒక సినిమాను డైరెక్ట్ చేస్తున్నాను. అయితే కొద్ది రోజుల్లో మనం ఇక రీమేక్ సినిమాలు చేసే అవసరం కూడా ఉండదు. ఎందుకంటే ఉదాహరణకి ఆడుజీవితం సినిమా అన్ని భాషల్లోనూ రిలీజ్ అవుతుంది. కనుక ఇక మళ్లీ దీన్ని తెలుగులో తీయాల్సిన అవసరం లేదు కదా. భవిష్యత్తులో ఇక అన్ని చిత్రాలు అన్ని భాషల్లోనూ రిలీజ్ అవుతాయి. అందుకే రీమేక్‌లు ఇక ఉండవ్." అంటూ పృథ్వీరాజ్ చెప్పుకొచ్చారు. ఇక పృథ్వీరాజ్ డైరెక్ట్ చేసిన లూసిఫర్ సినిమా మలయాళంలో బ్లాక్ బస్టర్ అయింది. మోహన్ లాల్ నటించిన ఈ సినిమా రైట్స్‌ను తీసుకొని గాడ్ ఫాదర్ అంటూ తెలుగులో చిరంజీవి నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను తెలుగులోనూ డైటరెక్ట్ చేయాలని పృథ్వీరాజ్‌ను చిరంజీవి కోరారు. అయితే అప్పటికి ఆడుజీవితం సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఆ ఆఫర్‌ను పృథ్వీరాజ్ తిరస్కరించారు. ఇక ఆడుజీవితం విషయానికొస్తే ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తిగా ఎడారిలోనే జరిగింది. బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లిన ఓ కేరళ యువకుడు అక్కడి ఎడారిలో చిక్కుకుపోతాడు. అక్కడ అతను పడిన బాధలు, అనుభవించిన వేదన, తిరిగి మాతృభూమికి వచ్చిన ప్రయాణం నేపథ్యంలో ఈ సినిమాను తీశారు. వాస్తవిక సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు.

# అర్జెంట్‌గా దుబాయ్..



అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి సడెన్‌గా దుబాయ్ వెళ్లారు. పుష్ప 2 షూటింగ్ ముగించుకొని బన్నీ ఇంత సడెన్‌గా ఎందుకు వెళ్లారో అంటూ కొంతమంది ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవలే వైజాగ్, హైదరాబాద్‌లో పుష్ప 2 షూటింగ్ షెడ్యూల్‌ను ముగించారు. ప్రస్తుతం ఖాళీగానే ఉండటంతో ఈ రోజు తన భార్య అల్లు స్నేహ రెడ్డి, పిల్లలు అయాన్, అర్హలతో కలిసి దుబాయ్ వెళ్లారు అల్లు అర్జున్. అయితే ఇది వెకేషన్ కోసం వెళ్లిన టూర్ కాదట. మరి బన్నీ ఎందుకు వెళ్లారంటే?

మైనపు విగ్రహం.... దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో అల్లు అర్జున్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారు. ఈ ఈవెంట్?కి హాజరయ్యేందుకే బన్నీ ఫ్యామిలీతో పాటు దుబాయ్ వెళ్లారు. పుష్ప సినిమాతో ఇంటర్నేషనల్ లెవెల్‌లో పేరు తెచ్చుకున్న బన్నీ విగ్రహాన్ని ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేయడంపై ఆయన ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారు. ఆ మైనపు విగ్రహం కోసం అల్లు అర్జున్ గత ఏడాది అక్టోబర్‌లో తన కొలతలు ఇచ్చి వచ్చారు. మార్చి 28న ఈ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారు. మార్చి 28 రాత్రి 8 గంటలకి ఈ కార్యక్రమం జరగబోతుంది. ఇప్పటికే మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో తెలుగు హీరోలు ప్రభాస్, మహేష్ బాబు మైనపు విగ్రహాలు ఏర్పాటు చేశారు. కానీ ఇవి లండన్‌లోని మ్యూజియంలో ఉన్నాయి. అయితే అల్లు అర్జున్‌ది మాత్రం దుబాయ్ మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్న తొలి ఇండియన్ యాక్టర్ విగ్రహం అల్లు అర్జున్‌దే కావడం విశేషం. అయితే ఈ విగ్రహం ఎలా ఉండబోతుందోనని బన్నీ ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. పుష్ప సినిమాలో తగ్గేదేలే అంటూ అల్లు అర్జున్ చేసిన మేనరిజంతో ఉంటుందేమోనని అంతా అనుకుంటున్నారు. అయితే అల వైకుంఠపురంలో రెడ్ జాకెట్ వేసుకున్న స్టైయిల్లో ఉంటుందని మరికొంతమంది అంటున్నారు. మరి విగ్రహం ఎలా ఉంటుందో చూడాలి. ఇక కెరీర్ విషయానికొస్తే అల్లు అర్జున్ ఫోకస్ మొత్తం ప్రస్తుతం పుష్ప 2పైనే ఉంది. వీలైనంత త్వరగా పుష్ప 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకొని సినిమాను ముందు ప్రకటించినట్లు ఆగస్టు 15న రిలీజ్ చేయాలని బన్నీ ప్లాన్ చేస్తున్నాడు. పాన్ ఇండియా లెవల్లో ఈ సినిమా గురించి అందరూ ఎదురుచూస్తున్నారు. ఇక ఇది పూర్తయిన తర్వాత సందీప్ రెడ్డి వంగా, త్రివిక్రమ్ శ్రీనివాస్‌లతో కూడా ప్రాజెక్ట్‌లు చేయాల్సి ఉంది. అయితే తమిళ డైరెక్టర్ అట్లీతో కూడా బన్నీ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాడు. మరి ఇందులో ఏది ముందు అవుతుందో చూడాలి. మేక్సిమమ్ అట్లీ సినిమానే బన్నీ అనౌన్స్ చేసే అవకాశం ఉంది.



# హోలీ సెలబ్రేషన్‌లో

విజయ్ దేవరకొండ- మృణాల్ ఠాకూర్ హోలీ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. నిర్మాత దిల్ రాజు ఏర్పాటు చేసిన ఈ ఈవెంట్‌లో ఫ్యామిలీ స్టార్ మూవీ టీమ్ పాల్గొంది. ఫ్యాన్స్ మధ్యలో హోలీ సెలబ్రేట్ చేసుకున్న తర్వాత ఫ్యామిలీ స్టార్ సినిమా నుంచి థర్డ్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'మధురము కదా..' అంటూ సాగే ఈ పాట ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. సాంగ్‌లో విజయ్-మృణాల్ చాలా అందంగా కనిపించారు. లవ్ సాంగ్.... విజయ్, మృణాల్ మధ్య ప్రేమను తెలియజేసే విధంగా ఈ సాంగ్ ఉంది. ఈ పాటకి శ్రీమణి లిరిక్స్ కూడా ఆకట్టుకుంటున్నాయి. ఇక శ్రేయా ఘోషల్ ఈ పాటను తనదైన స్టైల్?లో ఆలపించారు. ఇప్పటికే ఫ్యామిలీ స్టార్ నుంచి వచ్చిన రెండు సాంగ్స్ బ్లాక్ బస్టర్ అయ్యాయి. ఫస్ట్ సింగిల్ 'నందనందనా', సెకండ్ సింగిల్ 'కళ్యాణి వచ్చా వచ్చా..' పాటలు వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు థర్డ్ సింగిల్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తుంది. ఈ సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ సంగీతం అందించారు. ఇక ఫ్యామిలీ స్టార్ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 28న రిలీజ్ చేయబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మించారు. పరశురామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కాబోతుంది.



# కల్కి గురించి కమల్ హాసన్..







ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కల్కి 2898 ఏడీ సినిమా మే 9న రిలీజ్ కాబోతుంది. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కమల్ హాసన్ ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. మహానటి డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల కల్కి టీమ్ ఇటలీలో ఓ షూటింగ్ షెడ్యూల్ ముగించింది. ప్రభాస్-దిశా పటానిపై ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఇక ఈ చిత్రంలో కమల్ హాసన్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కమల్ హాసన్.

నా రోల్ ఇదే... ఈ భారీ బడ్జెట్ సినిమాలో తాను అతిథి పాత్రలో మాత్రమే నటిస్తున్నట్లు ఓ ఇంటర్వ్యూలో కమల్ క్లారిటీ ఇచ్చారు. అయితే చాలా మంది కమల్ ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్నారని ఊహించారు. కానీ వారందరికీ షాకిస్తూ కమల్ తాను గెస్ట్ రోల్ మాత్రమే చేస్తున్నానని చెప్పారు. అయితే ఇది విక్రమ్ సినిమాలో చివరిలో వచ్చే రోలెక్స్ పాత్రలా ఉంటుందేమో అంటూ ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఎందుకంటే విక్రమ్‌లో సూర్య చేసిన ఈ రోలెక్స్ పాత్ర కేవలం 5 నిమిషాలే ఉన్నా ఫ్యాన్స్‌కి మాత్రం తెగ నచ్చేసింది. తర్వాత పార్ట్‌పై భారీ అంచనాలు పెంచేలా చేసింది రోలెక్స్ క్యారెక్టర్. ఇక కమల్ పాత్ర కూడా అలానే ఉంటుందేమో అని ఆయన ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇక ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక దిశా పటానీ కూడా మరో కీలక రోల్‌లో కనిపిస్తుంది. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కల్కి సినిమా వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ మూవీ టీమ్ మాత్రం ఇప్పటివరకూ సినిమా రిలీజ్ వాయిదాపై ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. మరి చిత్రాన్ని వాయిదా వేస్తారో లేక అనుకున్నట్లుగా మే 9న రిలీజ్ చేస్తారో చూడాలి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ని అశ్విని దత్ నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇక కల్కితో పాటు ప్రభాస్ చేతిలో మరో రెండు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి మారుతి డైరెక్షన్‌లో ది రాజా సాబ్ కాగా మరొకటి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రాబోతున్న సలార్ పార్ట్ 2. ఇందులో సలార్ 2పై భారీ అంచనాలు ఉన్నాయి. సలార్ పార్ట్ 1 గతేడాది రిలీజై మంచి వసూళ్లు సాధించింది. ప్రభాస్‌ను మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కించింది. దీంతో సలార్ 2 కోసం రెబల్ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.

# నమ్మలేని నిజం





టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందబోతుంది. టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందబోతుంది. అందుకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లుగా ఇటీవలే రాజమౌళి ఒక కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించాడు. ఇప్పటి వరకు హీరో తప్ప మరే నటుడిని ఎంపిక చేయలేదని కూడా జక్కన్న చెప్పుకొచ్చాడు. సోషల్ మీడియా మరియు మెయిన్ స్ట్రీమ్ మీడియాలో మాత్రం రకరకాలుగా ప్రచారం జరుగుతూనే ఉంది. హాలీవుడ్ నటుడు ఈ సినిమాలో నటించబోతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ ఈ సినిమాలో నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. రాజమౌళి గత చిత్రం ఆర్ఆర్ఆర్ లో హీరోయిన్ గా ఆలియా భట్ నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా లో ఆలియా పాత్ర గురించి అంత ఇంత అంటూ ప్రచారం చేశారు. కానీ అందులో ఆలియా పాత్ర మరీ నిరాశాజనకంగా ఉంది. రాజమౌళి పై ఆలియా చాలా కోపంగా ఉందనే వార్తలు కూడా వచ్చాయి. ఆర్ఆర్ఆర్ సినిమాలో తనకు ఏమాత్రం ప్రాముఖ్యత ఉన్న పాత్రను ఇవ్వని రాజమౌళి సినిమాలో ఆలియా నటించేందుకు ఒప్పుకుంటుందా అంటే కచ్చితంగా లేదు అనే సమాధానం వస్తుంది. కానీ కొందరు బాలీవుడ్ వర్గాల వారు మాత్రం ఈసారి ఆలియా ను తీసుకుని ప్రాముఖ్యత ఉన్న పాత్రను ఇవ్వాలని జక్కన్న భావిస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు రాజమౌళి నుంచి ఈ విషయమై ఎలాంటి స్పష్టత రాలేదు. ఒక వేళ ఆలియా భట్ కనుక మహేష్ బాబు సినిమాలో నటిస్తే తప్పకుండా పాన్ ఇండియా రేంజ్ లో మంచి క్రేజ్ సినిమాకు క్రియేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి అనేది సినీ విశ్లేషకుల అభిప్రాయం.

# కాస్త రిస్కేమో టిల్లు



డీజే టిల్లుకి సీక్వెల్ గా సిద్ధమైన టిల్లు స్క్వేర్ మూవీతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకోవాలని సిద్దు జొన్నలగడ్డ గట్టి ప్రయత్నం చేస్తున్నారు డీజే టిల్లుకి సీక్వెల్ గా సిద్ధమైన టిల్లు స్క్వేర్ మూవీతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకోవాలని సిద్దు జొన్నలగడ్డ గట్టి ప్రయత్నం చేస్తున్నారు. మార్చి 29న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతోంది. డీజే టిల్లు చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కించి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. రాధిక క్యారెక్టర్ తో టిల్లు పండించిన వినోదానికి యూత్ బాగా కనెక్ట్ అయ్యారు. అయితే ఈ సారి రాధిక ప్లేస్ లోకి లిల్లీని సిద్దు తీసుకొచ్చాడు. లిల్లీగా అనుపమ పరమేశ్వరన్ బోల్డ్ అండ్ రొమాంటిక్ ఇంటిమెంట్ సన్నివేశాలతో దర్శనం ఇవ్వబోతోంది. ఆమె ఇలాంటి పాత్ర చేయడంతో టిల్లు స్క్వేర్ సినిమాకు కావల్సినంత బజ్ క్రియేట్ అవుతోంది. కంప్లీట్ గా యూత్ ఆడియన్స్ ని దృష్టిలో ఉంచుకొని ఈ చిత్రాన్ని రెడీ చేసినట్లు టీజర్ లో ఉన్న సన్నివేశాల బట్టి అర్థమవుతోంది.

రొమాంటిక్ కామెడీకి యూత్ నుంచి మంచి రెస్పాన్స్ ఉంటుంది. ముద్దుగుమ్మ అందాల కలర్ ఫుల్ హోలీ అందుకే డీజే టిల్లులో లేని మసాలాని టిల్లు స్క్వేర్ లో అదనంగా యాడ్ చేశారు. అనుపమ పరమేశ్వరన్ కూడా ఎలాంటి రెస్ట్రిక్షన్స్ లేకుండా సిద్దుతో ఇంటిమెంట్ సన్నివేశాలు చేసింది. ఆమె క్యారెక్టర్ రాధికని మించి ఉంటుందని అందరూ భావిస్తున్నారు. అయితే ఈ ఓవర్ మసాలా సన్నివేశాలు టిల్లు స్క్వేర్ కి మైనస్ అవుతాయేమో అనే అనుమానం కూడా కలుగుతోంది. ఇప్పుడు మూవీ రన్ టైం కూడా రిస్క్ ఫ్యాక్టర్ ని మరింత పెంచేలా ఉందనే మాట వినిపిస్తోంది. మూవీ 2 గంటల కంటే తక్కువ నిడివి మాత్రమే ఉంటుందంట. ఈ సినిమా రన్ టైంపై కూడా కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సినిమాకి కథని అందించింది సిద్దునే కాబట్టి కచ్చితంగా ప్రేక్షకులకి ఏం కావాలి. ఏ స్థాయిలో ఇవ్వాలనే దానిపై ఒక స్పష్టత ఉండొచ్చని అనుకుంటున్నారు. కాబట్టి అవసరమైన మేరకు 1 గంట 58 నిమిషాల నిడివితో సినిమా అవుట్ ఫుట్ రెడీ అయినట్లు టాక్. పర్ఫెక్ట్ సీన్స్ తో లెక్కల ప్రకారమే డీజే టిల్లులో మిస్ అయిన రొమాంటిక్ మసాలా సన్నివేశాలు టిల్లు స్క్వేర్ లో పెట్టారు. ఇవి సినిమాకి అవే అదనపు అస్సెట్ అవుతాయని భావిస్తున్నారు. వారి అంచనాలకి తగ్గట్లుగా రన్ టైం కానీ, రొమాంటిక్ సన్నివేశాలు కానీ సినిమాలు ప్లస్ అయితే ఒకే, లేదంటే సిద్దు పెద్ద రిస్క్ తీసుకున్నట్లు అవుతుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చూడాలి మరి ఈసారి సిద్దు ప్లాన్ ఎలా వర్కౌట్ అవుతుందో.